క్లుప్తంగా

పేద విద్యార్థికి చేయూత



ప్రిన్సిపాల్‌కు నగదు అందిస్తున్న రంజాన్

గుంతకల్లు: ఓ పేద విద్యార్థికి లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ సభ్యులు అండగా నిలిచారు. పట్టణంలోని కార్మెల్ జ్యోతి పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న పేద విద్యార్థి దర్శన్ తల్లిదండ్రులు ఇరువురు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులకు గురుతున్నారని తెలుసుకున్న లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రంజాన్ మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ పవిత్రకు ఫీజు కింద రూ.5 వేలు అందజేశారు. లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ సక్రమంగా జరగాలి

గుంతకల్లుటౌన్: ఇంటింటా చెత్తసేకరణ రోజూ సక్రమంగా జరిగేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య శానిటేషన్ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఆయన పట్టణంలోని రాజేంద్రనగర్, పాతగుంతకల్లు కచేరికట్ట వీధుల్లో చెత్తసేకరణ, పారిశుధ్య పనులను పరిశీలించారు. డయేరియా ప్రబలకుండా ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు బహుమతులందిస్తున్న దృశ్యం

యాడికి: విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు వెంకటేష్‌కు ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద యోగ చంద్రికకు రూ.3వేలు, తృతీయ బహుమతి కింద షహనాబీ, సుప్రియకు తలా రూ.రెండువేలు చొప్పున బహూకరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగన్న, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సత్య ప్రసాదరెడ్డి, పలువురు పెన్షనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడిగా వీరేష్



వీరేష్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: రాయలసీమ దళిత సంఘం జిల్లా అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ 14వ వార్డు ఇన్‌చార్జ్ ఎస్.వీరేష్‌ను నియమించినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు టి.రామాంజనేయులు, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ ఎగ్గుల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఇందిరానగర్‌లో జరిగిన ఆర్‌డీఎస్ సమావేశంలో దళితులపై పెరిగిన దాడులను అరికట్టేందుకు రానున్న చేపట్టాల్సిన ఉద్యమాలపై చర్చించారు. దళితుల సమస్యల పరిష్కారానికి పాటుపడాలని వారు సూచించారు.

అండర్-16 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



మహమ్మద్ షా తమీం

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి ఆర్డీటీ క్రికెట్ క్యాంపుకు చెందిన మహమ్మద్ షా తమీం అండర్ -16 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆర్డీటీ క్రికెట్ కోచ్ బార్గవ్ తెలిపారు. ఈనెల 20 వరకు విజయనగరంలో జరిగే అంతర్ జిల్లా టోర్నమెంట్‌లో పాల్గొంటాడన్నారు. తమీం ఎంపిక పట్ల ఆర్డీటీ ఏటీఎల్ లలిత, సీనియర్ కోచ్ సాధిక్‌వలి, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

బస్సుల కొనుగోలుపై మంత్రి వ్యాఖ్యలు అవాస్తవం

గుత్తి: రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ వైఎస్ జగన్ సర్కార్ ఒక్క కొత్త బస్సు కొనలేదనడం అవాస్తవమని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గుత్తిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్ సర్కార్ 1500 కొత్త ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసిందన్నారు. కరోనా సమయంలో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు జీతాలు ఇవ్వడంతోపాటు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. రవాణా శాఖ మంత్రి వాస్తవాలు మాట్లాడితే బాగుంటుందని, అబద్ధాలు చెప్పడం వల్ల ఎవరికీ ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించండి



యాడికిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న డాక్టర్ శంకర్‌నాయక్

శింగనమల: గ్రామాల్లో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని తరిమెల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. మంగళవారం తరిమెల పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా డయేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా రాకుండా ముందస్తు చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. ఎక్కడైనా అపరిశుభ్రత, నీరు కలుషితం అవుతుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రల ఆవశ్యకత తెలియజేశారు. సిబ్బంది ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ప్రతి గృహాన్ని సందర్శించి జాగ్రత్తలను వివరించాలన్నారు. వారికి రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలన్నారు. ఈరెండు నెలల్లో(జూలై,ఆగస్టు) ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, డెంగీ జ్వరాలు గురించి తెలియజేయాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అశ్వర్థ, నాగమ్మ, హెల్త్ ప్రొవైడర్స్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

యాడికి: వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా డెంగీలాంటి వ్యాధులు రావని యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీరామ్ కుమార్ అన్నారు. మంగళవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ప్రభుత్వాస్పత్రిలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సీహెచ్‌ఓ జుబేదా, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’పై రాజకీయ జోక్యం తగదు



పుట్లూరులో ఎంపీడీఓ దస్తగిరికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పుట్లూరు: ఉపాధిహామీ పథకంపై రాజకీయ జోక్యం తగదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సూరి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఉపాధి కూలీల సమస్యలపై పుట్లూరు ఎంపీడీఓ దస్తగిరి వినతిపత్రం అందించారు. రాజకీయ జోక్యంతో జిల్లాలో నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 8 వారాలకు సంబంధించిన వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి జాబ్‌కార్డుకు 200 పని దినాలు కల్పించడంతో పాటు రూ.600 రోజువారీ వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కూలీలకు పనిముట్లు కల్పించాలని, పనులకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు.

శింగనమల: ఉపాధి హామీకి సంబంధించి పెండింగ్‌లో నున్న 8 వారాల బిల్లులను వెంటనే కూలీలకు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ బీవీ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కింద జిల్లాలో దాదాపు 2.25 లక్షలు మంది పనులు చేస్తున్నారన్నారు. ఫీల్డ్ అసిసెంట్ల మార్పు కోసం అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఉపాధి హామీ పనులు నిలిపేస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకులు రాజకీయాలతో కూలీల పొట్ట కొడుతున్నారన్నారు. సంఘం మండల కార్యదర్శి సుంకన్న, నాయకులు రమణారెడ్డి, పుష్పరాజు, రామాంజినేయులు, ఎర్రిస్వామి, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనం చెల్లించాలి

పెద్దవడుగూరు : మండలంలోని ఉపాధి కూలీలకు వేతనం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కృష్ణనారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 వారాలుగా పెండింగ్ ఉన్న బిల్లులను కూలీలకు అందించాలన్నారు. పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, ఆదినారాయణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

గుంతకల్లు: కేంద్ర ప్రభుత్వం వెంటనే నీట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. ఎన్‌టీఏ సంస్థతోపాటు నీట్ పరీక్షను తక్షణం రద్దు చేయాలన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. దీనిపై గురువారం విద్యాసంస్థలకు బంద్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఐక్య విద్యార్థి సంఘం నాయకులు వినోద్, వెంకట్‌నాయక్, రంగస్వామి, అక్షయ్, శివమణి, అఖిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: నీట్ పేపర్ లీకేజీతో ఎంతో మంది తెలివైన విద్యార్థులు నష్టపోయారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షుడు చిన్నా పేర్కొన్నారు. మంగళవారం వారు ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కేజీ నుంచి పీజీ వరకు అన్ని రకాల విద్యాసంస్థల బంద్ తలపెట్టామన్నారు. ఇందుకు విద్యార్థులు సహకరించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు బాలాజీ, కృష్ణ, ఈశ్వర్, గురు, దన, రవి తేజ, మహేష్, కిరణ్, అలీ పాల్గొన్నారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



గార్లదిన్నెలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

గార్లదిన్నె: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం సజావుగా జరిగింది. ప్రొసీడింగ్ అధికారి సుధాకర్ రెడ్డి, అంబుడ్స్‌మన్ మధుసూదన్, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి హాజరయ్యారు. మండలంలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది 31 వరకు ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఏలో దాదాపు 1209 పనులకు రూ.11.69 కోట్లు ఖర్చు చేశారు. సామాజిక తనిఖీ బృందం పైపనులపై వారం రోజులుగా తనిఖీలో వెల్లడైన అంశాలను వెల్లడించారు. మొత్తం రూ.19,326 దుర్వినియోగమైనట్లు తెలియజేయగా బాధ్యుల నుంచి రికవరీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏపీఓ నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనంపై వివాదం



కమ్యూనిటీ భవనానికి తాళాలు వేసిన దృశ్యం

బుక్కరాయసముద్రం: చెన్నంపల్లిలో కమ్యూనిటీ భవనంపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య వివాదం చెలరేగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామంలో గ్రామ కంఠం స్థలంలో ఉన్న పబ్లిక్ మరుగుదొడ్డి స్థలంలో గ్రామస్తులంతా రూ.10 లక్షల వ్యయంతో చందాలు వేసుకుని అక్బర్ స్వామి పీర్ల చావిడి కోసం కమ్యూనిటీ భవనం నిర్మించారు. అయితే మంగళవారం సాయంత్రం టీడీపీ నాయకులు ఈ స్థలం తమదంటూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి కమ్యూనిటీ భవనానికి తాళం వేయిస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఇరు పార్టీల నాయకుల మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న బీకేఎస్ సీఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని ప్రజలను చెదరగొట్టి గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామం కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అయితే గ్రామంలో అందరికీ ఉపయోగపడే భవనానికి టీడీపీ నాయకులు తాళాలు వేయించడం ఏమాత్రం సరికాదని మండిపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు



వెనుక నుంచి ఢీ కొన్న లారీ

గుత్తి రూరల్: మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో ఓలారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎంగిలిబండ గ్రామ శివారులో పెట్రోల్ బంకు వద్ద రోడ్డుపై లారీని ఆపి ఉంచారు. అయితే గద్వాలకు చెందిన లారీ డ్రైవర్ రసూల్ తాడిపత్రి వైపు నుంచి హైదరాబాదు వైపునకు వెళ్తూ ముందు ఆగి ఉన్న లారీని గమనించకుండా వెళ్లి ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రసూల్‌ను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తరలించారు. కాగా వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న విషయం తెలుసుకొని ముందు వైపున ఆగి ఉన్న లారీ డ్రైవర్ కొద్దిసేపు తరువాత లారీతో ఉడాయించాడు. రోడ్డుపై లారీ నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దింతో పోలీసులు భారీ క్రేన్ తెప్పించి రోడ్డుపై ఉన్న లారీని పక్కకు తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీల్లో తలపడుతున్న ఉద్యోగులు

అనంతపురం: ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడేది వైద్యులేనని, అయితే వారికి విధి నిర్వహణలో మానసిక ఒత్తిడి ఉంటుందని, ఈ నేపథ్యంలో క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసం కలుగుతుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని పీటీసీ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన వికాస్ భారత్ స్పోర్ట్స్ ఫెస్ట్-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించి సరదాగా క్రికెట్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్లు ప్రవీణ్, వరదరాజులు, శంకర్ నారాయణ, సునీత, రజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో మెడికల్ ఉద్యోగులు పాల్గొని సరదాగా గడిపారు.

నూతన సీఈకి అభినందనలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా నూతనంగా నియమితులైన డాక్టర్ సి. లోకేశ్వర్లను పరీక్షల విభాగం కంప్యూటర్ సెక్షన్ ఉద్యోగులు మంగళవారం ఘనంగా సత్కరించారు. అదే విధంగా మినిమం స్కేల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన ఎస్.వెంకటస్వామిని ఉద్యోగులు సన్మానించారు. పరీక్షల విభాగం యూజీ సెక్షన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం. శంకర్, సూపరింటెండెంట్ ఫణి కృష్ణ, ప్రోగ్రామర్స్ బాలాజీ నాయక్, దివాకర్ శర్మ, విజయలక్ష్మి, జిలాన్‌బాషా పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ షాప్‌లో చోరీ

గుత్తి: స్థానిక అనంతపురం రోడ్డులోని వాసవీ ఎలక్ట్రికల్ షాపులో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షట్టర్‌ను ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించిన దుండగులు క్యాష్ బాక్స్‌లో ఉన్న దాదాపు రూ. 10 వేల నగదుతో పాటు ఇతర విలువైన సామగ్రిని అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణం తీసేందుకు వెళ్లిన యజమాని వెంకటరమణ... చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి యజ్ఞోపవీతం వితరణ



యజ్ఞోపవీతం అందిస్తున్న భక్తులు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అనంతపురానికి చెందిన కృష్ణమూర్తి, బాల సు. దీర్ అనే భక్తులు వెండి యజ్ఞోపవీతం వితరణ చేశారు. ఈమేరకు మంగళవారం రూ.25 వేలు విలువ చేసే 24 తులాల వెండి యజ్ఞోపవీతాన్ని అర్చకులకు అందజేశారు. ఈసందర్భంగా అర్చకులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలను ఆశీర్వదించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు

పామిడి: గజరాంపల్లి గ్రామంలో వెలసిన సుంకులమ్మ ఆలయంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వేదపండితులు సుధాకర్ అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మంగళహారతి అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

పెద్దవడుగూరు ఎస్ఐగా చిన్నరెడ్డప్ప



పెద్దవడుగూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా చిన్నరెడ్డప్ప మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ సెలవులో వెళ్లడంతో పోలీసు ఉన్నతాధికారులు ఎస్‌బీలో ఉన్న చిన్నరెడ్డప్పను ఇక్కడికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు యాడికి రూరల్ సీఐ రోషన్ తెలిపారు. మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని కొత్త ఎస్ఐ హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటి నీరుపోస్తున్న కమిషనర్, అధికారులు

గుంతకల్లుటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మోదీ ప్రారంభించిన అమ్మ పేరుతో ఒక మొక్క(ఏక్ పేడ్ మా కే నామ్) కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు పట్టణ శివారులోని తిమ్మాపురం రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటి నీరు పోశారు. ఎంఈ గురప్పయాదవ్, ఏసీపీ సత్తార్, టీపీఆర్ఓ మోహన్, ఆర్ఐ ఎర్రిస్వామి, ఏఈలు హరిక్రిష్ణ, సుదర్శన్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

భారత ప్రధాని మోదీ పిలుపుమేరకు స్థానిక బీజేపీ నాయకులు కస్తూర్బా పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో నాయకులు కొలిమి రామాంజి, విజయలక్ష్మి, సూర్యనారాయణ, కళావతి, పద్మ, సురేష్, కేశవ, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

సేవా అవార్డు అందుకున్న హరిప్రసాద్



షీల్డ్‌ను అందుకుంటున్న హరిప్రసాద్

గుంతకల్లు: కొన్నేళ్ల గ్రామీణ వైద్యునిగా సేవలు అందించిన డాక్టర్ ఎస్.హరిప్రసాద్‌యాదవ్ మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతులు మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. మంగళవారం వైద్యుల దినోత్సవం అన్నమయ్య జిల్లా కలికిరిలో సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురిని ఘనంగా సన్మానించారు. గుంతకల్లుకు చెందిన జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ గ్రామీణా వైద్యుడిగా, రక్తదాతగా పలు సామాజిక సేవల కార్యక్రమాలను గుర్తించి నిర్వాహకులు సేవా అవార్డుతో సత్కరించారు.

ఘనంగా కృతజ్ఞతా కూడిక

అనంతపురం కల్చరల్: జిల్లా పాస్టర్లు మంగళవారం స్థానిక ఎస్ఎస్ ప్రార్థనా ప్రాంగణంలో కృతజ్ఞతా కూడిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలను పాస్టర్ అబ్రహాం పాస్టర్ రూపస్ కుమార్ ఆరంభించారు. జీఆర్ ఆనంద్ వాక్యపరిచర్య చేస్తూ క్రీస్తునామాన్ని ఘనపరిచేవారికి ఎటువంటి లోటు ఉండదని, భగవంతుడు చూపిన మార్గాన్ని శ్రద్ధాభక్తులతో అనుసరించాలన్నారు. కాగా జిల్లా పాస్టర్ల వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు రెవరెండ్ నెహమ్యా నాగరాజు జన్మదిన వేడుక సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు వైపీ బాబు, పాస్టర్లు జహంగీర్ జాషువా, మనుష్యే, జీవన్‌బాబు, లాబాను సుధాకర్, లీనా డేబోరా పాల్గొన్నారు.

చెట్లు లేనిదే మానవ మనుగడ లేదు



మొక్క నాటుతున్న జీసీడీఓ శ్రీవాణి

బుక్కరాయసముద్రం: ప్రస్తుత ప్రపంచంలో చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని జీసీడీఓ శ్రీవాణి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ కాలుష్యం పెరిగిపోతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలో భోజనంతోపాటు తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



పూజలందుకున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి

పామిడి: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయం, చిన్న విఠోబ ఆలయంలో మంగళవారం యోగిని ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామితో పాటు రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తులను శోభాయమానంగా అలంకరించారు. వేదపండితులు విశ్వనాథశర్మ తదితరులు మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాలు గోవిందా, జై విఠల నామస్మరణలతో మార్మోగాయి.



లక్ష్మీనారాయణస్వామికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు